క్లుప్తంగా

మండలి చైర్మన్‌ను కలసిన సిటీ కో ఆర్డినేటర్



మండలి చైర్మన్ మోషేన్‌రాజుతో డాక్టర్ శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనమండలి చైర్మన్ మోషేన్‌రాజు ను వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మర్యాద పూర్వకంగా కలసి శాలువాతో సత్కరించారు. ఆదివారం పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం వెళ్లి చైర్మన్ నివాసంలో కలిశారు. ఈయన వెంట రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి సంస్థ రాష్ట్ర డైరెక్టర్ కానుబోయిన సాగర్ ఉన్నారు.

ఫొటోగ్రఫీ సెలెక్షన్ జడ్జిగా రాకేష్



విలేకరులతో మాట్లాడుతున్న రాకేష్

ప్రకాశం నగర్ : డిస్నీ హాట్ స్టార్ ఫొటోగ్రఫీ సెలెక్షన్ జడ్జిగా పులప రాకేష్ నియమితులయ్యారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన ఈ విషయం వివరించారు. ఎక్స్‌లెన్స్ ప్రోగ్రాం పేరుతో వివో ఇండియా ఈ ప్రోగ్రాం నిర్వహించిందని తెలిపారు. శుక్రవారం నుంచి సీజన్1లో ఐదు ఎపిసోడ్లు స్ట్రీమింగ్‌లో ఉంచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అవకాశం రావడం గర్వంగా ఉందన్నారు. కెమెరాతో కాకుండా మొబైల్ నుంచి కూడా ప్రొఫెషనల్ ఫొటోలు తీయడానికి వీలుందని, దాన్ని చాటి చెబుతూ వివో కంపెనీ ఫొటోగ్రఫీ సెలెక్షన్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏపీలో అందమైన దృశ్యాలను ఫొటోలు తీసిన తనను వివో బ్రాండ్ అంబాసిడర్‌గా పెట్టుకుందని తెలిపారు. ఆర్‌కే స్టడీ సెంటర్ ఏజీఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సేవలు అభినందనీయం

వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ నాగేశ్వర్



రక్తదానం చేస్తున్న అభిమానిని అభినందిస్తున్న నాగేశ్వర్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): సినీహీరో సూపర్‌స్టార్ మహేష్‌బాబు అభిమానుల సేవలు అభినందనీయమని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. ఈ నెల 9వ తేదీన మహేష్ బాబు జన్మదిన సందర్భంగా కృష్ణ-మహేష్ సేవాసమితి అధ్యక్షుడు తనూజ్, ఫ్రెండ్స్‌సర్కిల్ ఆధ్వర్యంలో జక్కంపూడి రామ్మోహనరావు బ్లడ్ బ్యాంక్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చందన నాగేశ్వర్ మాట్లాడుతూ సూపర్‌స్టార్ మహేష్ బాబు చిన్న పిల్లల గుండెకు శస్త్ర చికిత్సలు తన నిధులతో నిర్వహించడం అభినందనీయం అన్నారు. మహేష్‌బాబును ఆయన అభిమానులు ఆదర్శంగా తీసుకుని ఏర్పాటు చేసిన రక్తదానం శిబిరానికి హాజరు కావడం సంతోషంగా ఉందని తెలిపారు. అభిమానుల మధ్య కేక్ కట్ చేశారు. రక్తదానం చేసిన వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు. రుడా చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, విజయలక్ష్మి ఫిలింస్ అధినేత కర్రి సంజీవరెడ్డి పాల్గొన్నారు. డాక్టర్ చొల్లంగి సత్యగిరి, మహేష్‌బాబు అభిమానులు పాల్గొన్నారు.

తాతా సందీప్ శర్మకు శ్రీగురు పురస్కారం

ప్రకాశం నగర్ : శతావధాని తాతా సందీప్ శర్మకు శ్రీగురు పురస్కారాన్ని, 'ప్రవచన బాదరాయణి' అనే బిరుదును ప్రదానం చేశారు. ఆదివారం ఏలూరులో జరిగిన అఖిల భారతీయ బ్రాహ్మణ మహాసంఘ్ రాష్ట్ర శాఖ వార్షిక సమావేశాల్లో భాగంగా ఈ పురస్కారం అందించారు. ప్రవచన రంగంలో సందీప్ శర్మ చేసిన విశేష కృషికి గుర్తింపుగా ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ దేవదాయ ధర్మదాయ శాఖ సలహాదారు జ్వాలాపురపు శ్రీకాంత్, ఏబీబీఎం రాష్ట్ర అధ్యక్షుడు ఇంద్రకంటి ప్రసాద్ శర్మ చేతుల మీదుగా సత్కారం అందుకున్నారు.

వైఎస్సార్ సీపీలో టీడీపీ నాయకుల చేరిక

సీతానగరం: మండలంలోని పలు గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఆదివారం సీతానగరం జీవీకే కన్వెన్షన్ హాలులో నియోజకవర్గ పార్టీల చేరికల కమిటీ కన్వీనర్ గద్దె వెంకటకృష్ణ చౌదరి ప్రోద్బలంతో వంగలపూడికి చెందిన ముత్తిన శ్రీనివాస్, వేములపల్లి రాజు (పురుషోత్తపట్నం)తోపాటు మరికొందరికి ఎమ్మెల్యే రాజా కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలకు ఆకర్షితులైనవారు తమ పార్టీలో చేరుతున్నారన్నారు.

అందంగా.. అర్బన్ స్క్వేర్‌గా

- సుబ్రహ్మణ్య మైదానంలో ఆధునిక వసతులు
- ఓపెన్ ఎయిర్ థియేటర్‌గా మార్పు
- రూ.6 కోట్లతో పనులు
- దసరా నాటికి నిర్మాణం పూర్తి



ఇలా అందంగా సిద్ధం కానున్న సుబ్రహ్మణ్య మైదానం (నమూనా చిత్రం)



సాగుతున్న నిర్మాణ పనులు

రాజమహేంద్రవరం సిటీ: మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక వసతులు కల్పిస్తూ చారిత్రక బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్య మైదానాన్ని అద్భుతమైన కట్టడంగా తయారు చేసేందుకు నగర పాలక సంస్థ సన్నాహాలు ప్రారంభించింది. చారిత్రక ఆనవాళ్లను ఏమాత్రం చెరిపివేయకుండా ఉన్న కట్టడాలను ఏమాత్రం చెక్కు చెదరకుండా భవిష్యత్ తరాలకు అందుబాటులో ఉండే విధంగా ఆధునిక సౌకర్యాలతో అర్బన్ స్క్వేర్‌గా తయారు చేస్తున్నారు. సుమారు రూ.6 కోట్ల వ్యయంతో తయారవుతున్న ఈ ఆధునిక నిర్మాణాన్ని దసరాకు ప్రారంభించే లక్ష్యంగా నిర్మాణం సాగిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్య మైదానాన్ని ఏమాత్రం ఇబ్బంది లేకుండా నిర్మాణం చేపట్టే విధంగా మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశారు. మైదానంలో ఓపెన్ ఎయిర్ థియేటర్, ప్రస్తుతం ఉన్న శ్రీ గరికపాటి రాజారావు స్మారక వేదికను యథాస్థానంలో ఉంచుతారు. ఆధునిక వసతులతో పూర్తి లైటింగ్‌తో మెయిన్ స్టేజ్, ప్రస్తుతం ఉన్న శ్రీ వేంకటేశ్వర ఆనం కళాకేంద్రం ఫ్రంట్ ఎలివేషన్, కళాకేంద్రం ప్రవేశానికి ఆధునిక వసతులతో ద్వారం, అత్యాధునిక లైటింగ్ వ్యవస్థ, వాటర్ ఫౌంటెన్ ఏర్పాటు చేయనున్నారు.

నగరానికి శోభ

నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్మాణం అవుతున్న అర్బన్ స్క్వేర్ ద్వారా నగరానికి మరింత శోభ తెచ్చేలా కృషి చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. సుమారు రెండు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ మైదానాన్ని భవిష్యత్‌లో అందరికి ఉపయోగపడేలా నిర్మాణం జరుగుతుందని అధికారులు చెబుతున్నారు. శ్రీ వేంకటేశ్వర ఆనంకళాకేంద్రం, శ్రీ బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్య మైదానం అర్బన్ స్క్వేర్‌గా మార్పు చెందడం ద్వారా భవిష్యత్‌లో మరిన్ని కార్యక్రమాలు జరుపుకునేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు.

రెండు అవుట్ గేట్లు ఏర్పాటు చేస్తాం



భవిష్యత్ తరాల అవసరాలకు అనుగుణంగా సిద్ధం అవుతున్న ఈ మైదానం నగరంలో అద్భుతమైన ప్రాంతంగా నిలుస్తుంది. సుబ్రహ్మణ్య మైదానానికి రెండు అవుట్ గేట్లు ఏర్పాటు చేస్తాం. నిర్మాణం శరవేగంగా జరుగుతోంది.

– పాండు రంగారావు ఎస్ఈ, నగర పాలక సంస్థ

కన్నమాంబ కరుణ అందరిపైనా ఉండాలి

ఎంపీ భరత్‌రామ్



శ్రీకన్నమాంబ ఉత్సవాల్లో పాల్గొన్న ఎంపీ భరత్‌రామ్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరం నగర వాసులకు అత్యంత ఇష్ట దైవమైన శ్రీ కన్నమాంబ కరుణ అందరిపైనా ఉండాలని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ ఆకాంక్షించారు. ఆదివారం నగరంలోని స్టేడియం రోడ్డు వీటీ కళాశాల సెంటర్ వద్దగల శ్రీ కన్నమాంబ జాతర మహోత్సవం ఇన్నీసుపేటలో వనుము బుజ్జి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మార్గాని సురేష్, ఎన్‌వీ శ్రీనివాస్, నగర వైఎస్సార్ సీపీ యువజన విభాగ అధ్యక్షుడు పీతా రామకృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు వనుము బుజ్జి, గుత్తుల శ్రీధర్, వనుము తాతారావు, గద్వాల రామకృష్ణ, కర్రి రామారావు, జానీ, రవి ఫ్రెండ్ సర్కిల్ పాల్గొన్నారు.

జనం సమస్యలు పరిష్కరించిన జక్కంపూడి



కంబాల చెరువు సెంటర్‌లో కేక్ కటింగ్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజా, రుడా చైర్‌పర్సన్ షర్మిలారెడ్డి తదితరులు



బుర్రిలంకలో మాట్లాడుతున్న మంత్రి రాంబాబు. చిత్రంలో ఎమ్మెల్యే రాజా, నాగేశ్వర్, వీర్రాజు తదితరులు

- వాడవాడలా రామ్మోహన్‌రావు జయంతి వేడుకలు
- క్షీరాభిషేకాలు, నూతన వస్త్రాల పంపిణీ

రాజమహేంద్రవరం సిటీ: ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేసిన జనయోధునిగా ఎదిగిన తమ తండ్రి జక్కంపూడి రామ్మోహనరావు ఆశయాలను సాధించేందుకు నిరంతరం కృషి చేస్తామని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడిరాజా, వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రీజనల్ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ పేర్కొన్నారు. మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు జయంతి సందర్భంగా నగరంలో వాడవాడలా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత కంబాల చెరువు జక్కంపూడి చౌక్‌లోని రామ్మోహనరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం 70 కేజీల భారీ కేక్‌ను రాజా కట్ చేసి అభిమానులకు అందించారు. వారు మాట్లాడుతూ తమ తండ్రి రామ్మోహనరావు మంత్రిగా పనిచేసిన సమయంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. అనంతరం నగరంలో జయంతి వేడుకల్లో జక్కంపూడి గణేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని రామ్మోహనరావు చిత్రపటానికి క్షీరాభిషేకం, పేదలకు వస్త్రదాన కార్యక్రమాలు నిర్వహించారు. డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, రుడా చైర్ పర్సన్ మేడపాటి షర్మిలా రెడ్డి, రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్, వైఎస్సార్ సీపీ రంపచోడవరం పరిశీలకులు నందెపు శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు కోడి ప్రవీణ్, వక్ఫ్ బోర్డ్ జిల్లా అధ్యక్షుడు ఆరిఫ్, ఎస్సీ సెల్ పార్లమెంట్ అధ్యక్షుడు మాసా రామజోగ్, నగర ఎస్సీ సెల్ చైర్మన్ కాటం రజనీకాంత్ పాల్గొన్నారు.

200 మంది రక్తదానం

కడియం: మండలంలోని బుర్రిలంకలో పార్టీ నాయకులు కొత్తపల్లి శివాజీ, మూర్తిల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో 200 మందికిపైగా యువకులు రక్తదానం చేశారు. డాక్టర్ వైఎస్సార్ జక్కంపూడి రామ్మోహనరావు బ్లడ్‌బ్యాంకు సిబ్బంది రక్తాన్ని సేకరించారు. ఈ శిబిరాన్ని మంత్రి అంబటి రాంబాబు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఏపీ స్టేట్ గ్రీనింగ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజులతో కలిసి ఆదివారం ప్రారంభించారు. జేసీఎస్ కన్వీనర్ తాడాల విష్ణుచక్రవర్తి సమకూర్చిన చీరలను వృద్ధులకు పంపిణీ చేశారు. శిబిరంలో ఎమ్మెల్యే రాజా రక్తదానం చేశారు. అంతకు ముందు వేమగిరి హైవే జంక్షన్‌లో వైఎస్సార్ సీపీ నాయకులు డాక్టర్ వెలుగుబంటి వెంకటాచలం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి అంబటి రాంబాబు పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. కడియపులంక పంచాయతీ పరిధిలోని దోసాలమ్మ కాలనీ వద్ద ఐఎస్ఏ మాజీ అధ్యక్షులు పల్ల సుబ్రహ్మణ్యం, పల్ల సత్యనారాయణ, గణపతిల ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేశారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు, మండల పార్టీ అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ దొంతంశెట్టి వీరభద్రయ్య, శాప్ డైరెక్టర్ భీమిరెడ్డి నాగేంద్ర, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి బదుగు ప్రశాంతకుమార్, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలం, సొసైటీ అధ్యక్షుడు తిరుమలశెట్టి శ్రీను, ఎంపీటీసీ సభ్యుడు ఆకుల సుధాకర్, చేనేత సొసైటీ అధ్యక్షుడు యర్రా సూర్యనారాయణ, మాజీ సర్పంచ్‌లు సాపిరెడ్డి సూరిబాబు, దాసరి శేషగిరి పాల్గొన్నారు. జేగురుపాడులో మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, సర్పంచ్ యాదల సతీష్‌చంద్రస్టాలిన్ ఆధ్వర్యంలో జక్కంపూడి జయంతి నిర్వహించారు. కడియపుసావరంలో మాజీ సర్పంచ్ సాపిరెడ్డి సూరిబాబు, కామేష్‌ల ఆధ్వర్యంలో రామ్మోహనరావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. జక్కంపూడి రామ్మోహనరావు మల్టీపర్పస్ సెంటర్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేశారు.

ధవళేశ్వరంలో..

ధవళేశ్వరం: స్థానిక పోలీస్‌స్టేషన్ సెంటర్‌లో జరిగిన జక్కంపూడి జయంతి వేడుకల్లో మంత్రి అంబటి రాంబాబు, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం రూరల్ కో–ఆర్డినేటర్ చందన నాగేశ్వర్, పార్టీ యువజన విభాగం రీజనల్ కో–ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ పాల్గొన్నారు. జక్కంపూడి చిత్రపటానికి మంత్రి రాంబాబు పూలమాలలు వేశారు. హితకారిణి సమాజం డైరెక్టర్ డి.సరితారాణి, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ బాషా, వైఎస్సార్ సీపీ జిల్లా దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు పోసికుమార్ పాల్గొన్నారు. ధవళేశ్వరం ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో కొత్తపల్లి శివ,గెడ్డం సాయి ఆధ్వర్యంలో జక్కంపూడి జయంతి నిర్వహించారు. ఎర్రకొండపై బొడ్డేటి శివాజీ, బోడపాటి కుమార్ ఆధ్వర్యంలో జక్కంపూడి జయంతి నిర్వహించారు.

నాడు తండ్రితో, నేడు తనయుడితో అసెంబ్లీకి..

రాజమహేంద్రవరం రూరల్: ఆనాడు జక్కంపూడి రామ్మోహనరావుతో కలిసి అసెంబ్లీకి వెళ్లానని, నేడు ఆయన తనయుడు జక్కంపూడి రాజాతో కలిసి అసెంబ్లీకి వెళుతున్నానని మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. బొమ్మూరులోని వైఎస్సార్ సెంటర్‌లో న్యాయవాది, వైఎస్సార్ సీపీ నేత గొందేశి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలోను, ట్రైనింగ్ కళాశాల ఎదుటవీధిలో శ్రీదేవి తోపుడు బండ్ల వర్తక సంఘం అధ్యక్షుడు కనకాల రాజా ఆధ్వర్యంలో జక్కంపూడి జయంతి నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి అంబటి రాంబాబు జక్కంపూడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, రూరల్ కోఆర్డినేటర్ నాగేశ్వర్, డీసీసీబీ చైర్మన్ ఆకుల, రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ యువజన విభాగ రీజనల్ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్, పార్టీ రాష్ట్రకార్యదర్శి లింగం రవి, పార్టీ నగర మాజీ అధ్యక్షుడు నందెపుశ్రీనివాస్, వైఎస్సార్ టీయూసీ జిల్లాఅధ్యక్షుడు ముద్దాలఅను పాల్గొన్నారు.

అన్నదానం

ఐదుబళ్లమార్కెట్ సెంటర్‌లో చాపారాజా,రాంకీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని చందన నాగేశ్వర్ చేతులమీదుగా ప్రారంభించారు.

తొర్రేడులో..

తొర్రేడులో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఉప్పులూరి వీరవెంకటసత్యనారాయణ ఆధ్వర్యంలో జక్కంపూడి జయంతి నిర్వహించారు. జక్కంపూడి విగ్రహానికి చిట్టూరి వెంకటరావు, దండమూడి అర్జునరావు, గద్దె సుబ్బారావు, కొత్తపల్లి కేశవరామారావు, మెప్పిలి రాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మానవత్వం చాటుకున్న జక్కంపూడి గణేష్

రాజమహేంద్రవరం సిటీ: ప్రమాదంలో గాయపడి అపస్మారక స్థితిలో రోడ్డు పక్కన పడి ఉన్న గుర్తు తెలియని వ్యక్తిని ఆసుపత్రికి తీసుకుని వెళ్లి వైద్య సేవలు అందించి వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా రీజనల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేస్ మానవత్వం చాటుకున్నారు. ఆదివారం జక్కంపూడి రామ్మోహనరావు జయంతి కార్యక్రమాలు నగరంలోని పలు ప్రాంతాల్లో నిర్వహించారు. వాటిలో పాల్గొనేందుకు వెళుతున్న గణేష్ ఆర్యాపురం ఫైర్ స్టేషన్ సమీపంలో రోడ్డు ప్రమాదంలో గాయపడి అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తిని గమనించారు. తక్షణమే వాహనం దిగి ఆ వ్యక్తిని తన వాహనం ఎక్కించుకుని దగ్గరలోగల సాయి ఎమర్జెన్సీ ఆసుపత్రిలో చేర్పించి తక్షణమే వైద్య సేవలు అందించాలని కోరారు. ప్రస్తుతం ఆసుపత్రిలో వైద్యులు ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు.



గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తరలిస్తున్న గణేష్

జనం కోసం బతికిన నాయకుడు

- మాజీ ఎంపీ ఉండవల్లి
- జక్కంపూడి మిత్రమండలి ఆధ్వర్యంలో ఆత్మీయ కలయిక
- తరలివచ్చిన మూడు తరాల నాయకులు



ఆత్మీయ కలయికలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ ఉండవల్లి. చిత్రంలో జక్కంపూడి విజయలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే రౌతు

రాజమహేంద్రవరం సిటీ: పేదల కష్టాలు తెలుసుకుని వాటిని పరిష్కరించడమే లక్ష్యంగా జీవించి రాష్ట్ర స్థాయి నాయకుడిగా ఎదిగిన ప్రజా నాయకుడు మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు ఆలోచనలను మనమంతా గౌరవించి ఆచరించాల్సిన అవసరం ఉందని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. జక్కంపూడి 70 జయంతి సందర్భంగా స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జక్కంపూడి మిత్ర మండలి ఆధ్వర్యంలో హోటల్ ఆనంద్ రీజెన్సీ పందిరి హాల్‌లో జక్కంపూడి రామ్మోహనరావుతో కలసిన నడిచిన మూడు తరాలకు చెందిన రాజకీయ నాయకులు ఆత్మీయులు, కార్మికులు, మాజీ ప్రజా ప్రతినిధులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీ ఎంపీ ఉండవల్లి మాట్లాడుతూ రామ్మోహన్‌రావును చిన్నప్పటి నుంచి శ్వాస విడిచే వరకూ చూశానని, అతనిలో కఠోరమైన క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర శ్రమ రాష్ట్ర స్థాయి నాయకుణ్ణి చేసిందన్నారు. సమస్యను పరిష్కరించడంలో, పార్టీని ఎన్నికల్లో గెలిపించే ప్రయత్నం చేయడంలో ఆయనే దిట్ట అన్నారు. మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు మాట్లాడుతూ ప్రజల కోసం జీవితాన్ని అంతా ధారపోసిన నాయకుడు జక్కంపూడి అన్నారు. వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ నా భర్త రామ్మోహనరావు పేదల కోసం, కష్టాలలో ఉన్నవారి కోసం రాజకీయాలే ఊపిరిగా జీవితాన్ని సాగించిన ఆయన ధృవతారగా ఎదిగారన్నారు. ఇంతకాలం తమ కుటుంబాని ఆదరిస్తున్న రామ్మోహనరావు అభిమానులు, స్నేహితులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. డిగ్రీ చదువుతున్న సీతానగరం మండలం కూనవరం గ్రామానికి కొలమూరి సాయి పావనికి మూడు సంవత్సరాల ఫీజును మాజీ ఎంపీ ఉండవల్లి, జక్కంపూడి విజయలక్ష్మి చేతులు మీదుగా అందజేశారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్, పార్టీలకు అతీతంగా మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు అభిమానులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనలపై కాంగ్రెస్ నిరసన



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న పద్మశ్రీ తదితరులు



కాతేరులో కొవ్వొత్తులతో సాగిన శాంతి ర్యాలీ

రాజమహేంద్రవరం సిటీ: మణిపూర్‌లో జరుగుతున్న అమానవీయమైన ఘటనలకు వ్యతిరేకంగా తూర్పు గోదావరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. కోర్లమ్మపేట లోని జిల్లా పార్టీ కార్యాలయం వద్ద నుంచి నాయకులు కార్యకర్తలు ప్రదర్శనగా బయలుదేరి నాగదేవి థియేటర్ సెంటర్, లేపాక్షి షోరూం మీదుగా గోకవరం బస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. అల్లర్లను అదుపు చేయడంలో విఫలమైన ఆ రాష్ట్ర బీజేపీ ప్రభుత్వాన్ని వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కాంగ్రెసు వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సోడదాసి మార్టిన్ లూథర్, నగర కాంగ్రెస్ ఇన్‌చార్జి బోడా వెంకట్ పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనకు నిరసనగా శాంతి ర్యాలీ

రాజమహేంద్రవరం రూరల్: కాతేరు గ్రామంలో ఆదివారం కాతేరు క్రైస్తవ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మణిపూర్ ఘటనకు నిరసనగా కొవ్వొత్తులతో శాంతిర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ గ్రామంలో భరత్ నగర్ నుంచి ప్రారంభమై గణపతి నగర్ ,ఆనంద నగర్, శాంతినగర్ మీదుగా కాతేరు అక్కడి నుంచి చెరువుగట్టు మీదుగా వీవీనగర్ లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వరకు సాగింది. వందలాది మంది క్రైస్తవులు కొవ్వొత్తులతో మణిపూర్ ఘటనకు నిరసనగా నినాదాలు చేశారు. అనంతరం ప్యారిస్ పాస్టర్ వారా కృపావరం మాట్లాడుతూ మణిపూర్ లో క్రైస్తవులపై మారణ హోమం జరుగుతుంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కనీసం స్పందించకపోవడం దారుణమన్నారు. నాయకులు, పాస్టర్లు సీఆర్ ప్రేమ్‌కుమార్, ఎజ్రా, మోషే, జీవన్‌దాస్, స్వీట్ బాబు, హనూక్, ఇసాక్, ఎం.డేవిడ్‌రాజ్, రూత్ లిల్లీ పాల్గొన్నారు.

బొమ్మూరులో...

బొమ్మూరు క్రైస్తవ సంఘ కాపరుల సమాఖ్య(ఐక్యవేదిక) ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి మణిపూర్ ఘటనకు నిరసనగా శాంతి ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డుల నినాదాలతో మణిపూర్ ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతూ గ్రామవీధులలో శాంతిర్యాలీ చేపట్టారు. క్రైస్ట్ లూథరన్ సంఘ కాపరి రెవ.కె.అబ్ధాలోము, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

వృత్తిలో సామర్థ్యాన్ని వృద్ధి చేసుకోవాలి

- ఎంపీ భరత్‌రామ్
- ముగిసిన ఫొటో ట్రేడ్ ఫెయిర్

రాజానగరం: రోజురోజుకు పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆకళింపు చేసుకుంటూ, మార్పులకు అనుగుణంగా వృత్తిలో సామర్థ్యాన్ని వృద్ధి చేసుకోవాలని రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. దివాన్‌చెరువులోని ఎస్‌వీపీసీ కన్వెన్షన్ హాలులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజులు నిర్వహించిన గోదావరి ఫొటో ట్రేడ్ ఫెయిర్ – 2023 ఆదివారం ముగిసింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీ మాట్లాడుతూ ఫొటోగ్రఫీలో పోటీతత్వం కంటే పనితనానికే ఎక్కువ విలువ, ప్రాధాన్యత ఉంటుందన్నారు. వివిధ జిల్లాల నుంచి హాజరైన ఫొటోగ్రాఫర్లను, స్టాల్స్ నిర్వాహకులను అసోసియేషన్ అధ్యక్షుడు కోని శ్రీను, గౌరవాధ్యక్షుడు అల్లు బాబి సత్కరించారు. ఫొటో ట్రేడ్ ఫెయిర్‌ను ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రరావు, మాజీ కార్పొరేటర్లు సుబ్రహ్మణ్యం, బి.ప్రకాష్‌లు తిలకించారు. అసోసియేషన్ సలహాదారు కేతా శ్రీను, రావు అండ్ రావు, రాజమౌళి, వానపల్లి బాబి, ఎస్ఎస్ఎస్ శేఖర్, లాజర్, గోపి, యాపిల్ సూర్యకుమార్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక



కడియంలో కలసిన 1990-95 బ్యాచ్ విద్యార్థులు

కడియం: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1990–95లో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం అదే స్కూల్‌లో కలుసుకున్నారు. కుటుంబ సమేతంగా కార్యక్రమానికి హాజరైన వారంతా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. గురువులను సత్కరించారు.

వీటీ కాలేజీ విద్యార్థుల భేటీ

కంబాలచెరువు: స్థానిక వీటీ జూనియర్ కాలేజీలో 1972, 74 బ్యాచ్ ఇంటర్మీడియెట్ బైపీసీ చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. స్థానిక ప్రకాశం నగర్ ధర్మంచర కమ్యూనిటీ హాలులో డాక్టర్ దాట్ల భాస్కరరాజు ఆధ్వర్యంలో ఈ కలయిక జరిగింది. చెన్నై, బిలాస్‌పూర్, విజయవాడ, విశాఖ తదితర ప్రాంతాల నుంచి పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. 51సంవత్సరాలైనా తమ మధ్య స్నేహబంధం కొనసాగుతూ ఆనందంగా ఉంటున్నామన్నారు. జీవితపు మలిసంధ్యలో ఆనందంగా గడపడానికి, నూతన ఉత్సాహం కలగడానికి ఈ ఆత్మీయ సమ్మేళనం ఎంతగానో దోహద పడుతుందన్నారు. జ్ఞాపికగా మొక్కలు అందజేశారు. ఆదివిష్ణు, వైవీవీ మణ, డాక్టర్ బాలచంద్రుడు, కేవీ సీతారామమూర్తి, ప్రసాదరాజు, ఉదయ భాస్కర్, గంగాధర్, కామరాజు పాల్గొన్నారు.